PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 121 | 15 శనివారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

# దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం



## పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'పై

న్యూఢిల్లీ,ఆగస్టు14(ప్రజా సీమ )

దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆ విభజన కారణంగా నష్టపోయిన బాధితుల ధైర్యాన్ని ప్రధాని కొనియాడారు. ప్రతి ఏటా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

# విద్యుత్ దీపాల అలంకరణతో నగరంకు మరింత శోభ

## ఆకట్టుకుంటున్న అసెంబ్లీ, సచివాలయ భవనాలు

అమరావతి, ఆగస్టు 14 (ప్రజా సీమ ):




భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ప్రతిబింబించేలా సచివాలయంలోని ఐదు భవనాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. అసెంబ్లీ భవనాన్ని సైతం వివిధ రకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో భవన సముదాయం విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతోంది. అసెంబ్లీ, సచివాలయ ప్రాంగణాల్లోని రహదారులకు ఇరువైపులా, సెంట్రల్ పార్కులో వివిధ రంగులతో కూడిన ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం ప్రాంగణం విద్యుత్ వెలుగులతో శోభాయమానంగా మారి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. విజయవాడలోని లోక్ భవన్, ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, ప్రకాశం బ్యారేజ్, ప్రఖ్యాత ఉండవల్లి గుహలు, ఇతర చారిత్రక ప్రాముఖ్యత కలిగిన భవనాలు, ప్రముఖ కట్టడాలను సైతం విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ ప్రత్యేక విద్యుత్ అలంకరణలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయ భవనాలకు మరియు నగరానికి మరింత శోభను తీసుకువచ్చాయి.




# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

## పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు

హైదరాబాద్,ఆగస్ట్14(ప్రజా సీమ )):

తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం దక్కింది. 2026 స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పతకాలను ప్రకటించారు. ...మిగతా 2 లో...

# అధునాతన ఫైర్ వాహనాలకు జెండా ఊపిన సీఎం చంద్రబాబు







## 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు.

వీటిలో ఫైర్ ఫైటింగ్ వాహనాలు, వాటర్ బౌజర్లు, క్విక్ రెస్పాన్స్ వెహికల్స్ ఉన్నాయిమూడు దశల ఆధునీకరణ ప్రణాళికలో భాగంగా రెండో విడతలో ఈ వాహనాల కొనుగోలుప్రమాదాలకు వేగంగా స్పందించి ఆస్తి, ప్రాణనష్టాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక శాఖను58 అధునాతన అగ్నిమాపక వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత వేగంగా, సహాహనాలు, భారీ ప్రమాదాల సమయంలో నిరంతరాయంగా నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యం గల 20 వాటర్ బౌజర్లు ఉన్నాయి. వీటితో పాటు ఇరుకైన, రద్దీ ప్రదేశాల్లోకి వేగంగా చేరుకునేందుకు 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ వాహనాలను కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ వాహనాలను 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేశారు.

# సిఎం కనుసన్నల్లో నిషేధిత జాబితా

## బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శ

హైదరాబాద్,ఆగస్ట్14(ప్రజా సీమ )

:తెలంగాణలోని పలువురు ఐఏఎస్ అధికారులపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో భాగంగా కొంతమంది ఐఏఎస్ ఆఫీసర్లు ఉద్దేశపూర్వకంగా భలు గుప్పీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం బాధితుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో భాగమే అని అన్నారు. బాధితులు కాళ్లు అరిగేలా కలెక్టర్ కార్యాలయాలు, సబ్ రిజిస్టార్ ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

# గోల్డ్ బాండ్ల పంట పండింది..

### ఈసారి పెట్టుబడికి నాలుగింతల లాభం!

### సావరీన్ గోల్డ్ బాండ్ 2019-20 సిరీస్‌కు భారీ రాబడి

### రూ. 3,449 ఇష్యూ ధర కాగా.. రూ. 15,310 రిడెంప్షన్ ధర

### ఏడేళ్ల కాలంలో పెట్టుబడిపై 344 శాతం లాభం

సావరీన్ గోల్డ్ బాండ్లలో (ఎస్జీబీ) పెట్టుబడి పెట్టిన వారికి కనకవర్షం కురిసింది. 2019 ఆగస్టు 14న జారీ చేసిన ఎస్జీబీ 2019-20 సిరీస్-3 ముందస్తు ఉపసంహరణ (ప్రీమెచ్యూర్ రిడెంప్షన్) ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. ఈ బాండ్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు 2026 ఆగస్టు 14 నుంచి తమ పెట్టుబడులను నగదుగా మార్చుకోవచ్చని తెలిపింది.




# హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!:

### జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

### సోషల్ మీడియా వాడకంపై జనసేన శ్రేణులకు పవన్ కల్యాణ్ మార్గదర్శకాలు

### వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం వాడొద్దని స్పష్టం

### కూటమి ప్రభుత్వ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించాలని సూచన

### పార్టీ క్రమశిక్షణ, అంతర్గత విషయాలపై 9 కీలక మార్గదర్శకాలు జారీ



సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# వికసిత్ భారత్ లక్ష్యంగా మనం పనిచేయాలి: రాష్ట్రపతి ముర్ము

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.వికసిత్ భారత్ లక్ష్యంగా మనం పనిచేయాలి: రాష్ట్రపతి ముర్ము

ఇంటర్నెట్ డెస్క్: దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు.



ప్రజాసీమ

# డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

ఎంపి రఘురామిరెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా హైదరాబాద్, గ్రేటర్ పరిధిలోని సిటిజన్స్ అర్బన్ రీస్ట్రక్చరింగ్ అండ్ ఎకానమీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లకు భూకేటాయింపులు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఇకపోతే గ్లోబల్ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో

రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్దిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజక వర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని విద్యుత్తు వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్–2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు

ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# దేశ విభజనతో ఎన్నో జీవితాలు చిన్నాభిన్నం

మొదటిపేజీ తరువాయి

ప్రతి ఏటా స్వాతంత్య్ర దినోత్సవానికి ముందు రోజున భారత ప్రభుత్వం 'పార్టిషన్ హరర్స్ రిమెంబరెన్స్ డే'ను నిర్వహిస్తోంది. దేశ విభజన, సామూహిక వలసల అనంతరం జరిగిన అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన వారికి గుర్తుగా 2021 నుంచి కేంద్రం దీనిని పాటిస్తోంది. ఈ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి. నాడు విభజన గాయాల బాధితులు ప్రియమైన వారిని కోల్పోయారు. అంతులేని బాధను అనుభవించారు. అంతటి భయానక పరిస్థితుల నుంచి ప్రజలు తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు. ప్రతికూలతలను విజయంగా మార్చుకున్నారు. దేశ ప్రగతికి దోహదపడ్డారు. సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించడానికి, వికసిత్ భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషిచేసేలా వారి జీవితాలు మనందరికి స్ఫూర్తినిస్తాయని మోదీ పేర్కొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

మొదటిపేజీ తరువాయి

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని చెప్పారు. రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్‌కుమార్‌గౌడ్ స్పందించారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను అర్థం చేసుకుంటాం. పార్టీకి సంబంధించి నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలను బహిరంగంగా మాట్లాడకూడదని హితవు పలికారు. రాజగోపాల్‌రెడ్డి ప్రజా నాయకుడు.. నాకు మంచి మిత్రుడు. గీత దాటి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడటం సరికాదు. సమయం వచ్చినప్పుడు అవకాశాలు ఉంటాయి. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి వెళ్తుంది. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా మేం చేయట్లేదని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేనివాళ్లు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు.

# నేరాల స్వరూపం మారుతోంది

మొదటిపేజీ తరువాయి

ఎవరు ఏం అనుకుంటారోనని బయటకు కూడా చెప్పుకోవడం లేదని డీజీపీ అన్నారు. తాము 40 రకాల సైబర్ నేరాలను గుర్తించామని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఉంటున్నాయని వివరించారు. తాము ఎంత అడ్డుకట్ట వేస్తున్నా.. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్తగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# తెలంగాణ పోలీసు శాఖకు అరుదైన గౌరవం

మొదటిపేజీ తరువాయి

ఇందులో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 ప్రతిభావంతమైన సేవా పతకాలు ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన ముగ్గురు జూనియర్ కమాండోలు ఎంపికయ్యారు. బి. సత్యా రావు, కే. సందీప్ కుమార్, జే. వంశీకృష్ణ ఈ పతకాలను అందుకోనున్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అసాధారణ తెగువకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం దక్కింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందికి ఇచ్చే విశిష్ట సేవా పతకాల విభాగంలో తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేశారు. విధి నిర్వహణలో నిబద్ధత, సమర్థత, సేవా ప్రస్థానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక పోలీసు విధుల్లో ప్రతిభ, అంకితభావం, నిరంతర సేవలను గుర్తిస్తూ మరో 10 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి మొత్తం 15 పతకాలు దక్కాయి. ప్రతి ఏడాది స్వాతంత్య్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, అత్యుత్తమ దీర్ఘకాల సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

# చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు

మొదటిపేజీ తరువాయి

ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ అన్నారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్–1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖత్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు.


క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా ఫూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అందుకే ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా ఫులే విధానాలను కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాలు ఒకే చోట చదువు, జీవించడం ద్వారా కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందే జమ చేస్తున్నాం. ఈ ఏడాది నుంచే దీన్ని అమల్లోకి తెచ్చాం. కళాశాలల్లో ప్రవేశాలు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లో ఫీజు జమ అవుతుందన్నారు.

# కొత్తపల్లి జంక్షన్‌లో సిగ్నల్ వ్యవస్థీకరణకు శ్రీకారం

**కరీంనగర్: ఆగస్టు 1 (ప్రజా సీమ )**




కొత్తపల్లి జంక్షన్ సిగ్నల్ వ్యవస్థీకరణతో పాటు ఆధునిక హంగులతో అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం రైల్వే, ట్రాఫిక్ శాఖలకు చెందిన అధికారులు, స్టేషన్ అధికారులు లాంఛనంగా జంక్షన్‌ను ప్రారంభించారు. జంక్షన్ అభివృద్ధిలో భాగంగా నూతన లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరిచారు. దీంతో రాత్రివేళల్లో వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు మెరుగైన వెలుతురు, రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుంది. జంక్షన్ సుందరీకరణ, లైటింగ్, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కార్మికులు రాత్రింబవళ్లు శ్రమించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈ, సీనియర్ డీఓఎం అధికారులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం. రవీందర్, స్టేషన్ మాస్టర్లు తేజ, శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు. కొత్తపల్లి జంక్షన్ నూతన హంగులతో ప్రారంభం కావడం, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సిగ్నల్ వ్యవస్థ, నూతన లైటింగ్ అందుబాటులోకి రావడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు ప్రయాణికులు, స్థానిక ప్రజలకు మరింత భద్రత, సౌకర్యం కలుగుతుందని అధికారులు తెలిపారు.



# నేడు అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

## క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా పాలనాధికారి

**నిజామాబాద్, ఆగస్టు 14 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఈ నెల 15న (శనివారం) మద్యాహ్నం రెండు గంటలకు లబ్దిదారులకు ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం జిల్లా అధికారులతో కలిసి భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, రేషన్ కార్డులు కలిగి ఉన్న లబ్దిదారులు, రేషన్ డీలర్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారున్వయంతో కృషి చేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ వసతి ఉండాలని, వేదిక, సీటింగ్ అరేంజ్ మెంట్, సౌండ్ సిస్టం, ఎల్.ఈ.డీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లను పక్కాగా సరిచూసుకోవాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జిల్లా రెవెన్యూ అధికారి బి.గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ సాయన్న, సివిల్ సప్లైస్ డీ.ఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



# అంబరాన్నంటిన 'హర్ ఘర్ తిరంగా' సంబరాలు

**కరీంనగర్ ఆగస్టు 14(ప్రజా సీమ ))**

కరీంనగర్‌లో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా భారీ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మంకమ్మతోట, రాంనగర్ చౌరస్తా మీదుగా శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం వరకు కొనసాగింది. వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, యువత జాతీయ జెండాలతో పాల్గొనడంతో నగరం త్రివర్ణ శోభను సంతరించుకుంది. మాజీ ఎమ్మెల్యే ఎం. ధర్మారావు, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. భారత్ మాతా కీ జై 'వందేమాతరం' నినాదాలతో నగర వీధులు మార్మోగాయి. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి కార్యక్రమాన్ని ముగించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



# సంపాదకీయం

## దేశవిభజన ఒక చీకటి అధ్యాయం !

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి ప్రక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళు తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16–18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# అహింసతో సాధించిన అపూర్వ విజయం


భారత స్వాతంత్ర్య పోరాటం

- వందేమాతరం నుంచి జైహింద్ వరకు భారత స్వాతంత్ర్య గాథ

- ఆధునిక ప్రపంచ చరిత్రలో అరుదైన యుద్ధం.. భారత స్వాతంత్ర్య పోరాటం

- చారిత్రాత్మక విశ్లేషణ

వేంపల్లె నుంచి ప్రత్యేక కథనం:



భారతీయులు బ్రిటిష్ వారిని భారత భూభాగం నుంచి తరిమివేసి స్వాతంత్రాన్ని సంపాదించిన సుగడియ నేటి పంద్రాగస్టు .నేటి తో 79 సంవత్సరాలు ముగించుకొని త్వరితంగా తొలి శతాబ్ద ఉత్సవాల వైపు అడి గేస్తున్న నే పథ్యము నేడు. ప్రపంచంలోనే అజేయులు గా పేరొందిన ఆంగ్లేయు ల కు వ్యతిరేకంగా, అన్వాయుధాల కాలంలో అహింస,సత్యాగ్రహం అనే ఆయుధాల తో పోరాడి స్వాతంత్రం సంపాదిస్తారని ఎవరూ ఊహించని సంఘటన. పారిశ్రామిక విప్లవ నేపథ్యంలో సాధించిన అధిక ఉత్పత్తి ,అధునాతన శక్తి ,ఆయుధ సంపత్తి, నౌకాబల ఆధిపత్యంతో ప్రపంచాన్ని తన గుప్పెట్లో పెట్టుకున్న బ్రిటిష్ వారికి అహింసా యుద్ధం, సత్యాగ్రహం లాంటి మానవ శక్తి ఆయుధాలు ఎదుర్కొనడం అగ్ని పరీక్ష గా మారి భారతీయుల చేతిలో ఘోర ఓటమి ని మూటగట్టుకుంది. 1857 సంవత్సరంలో వారి ప్రైవేటు వర్తకుల కంపెనీ, బ్రిటిష్ తూర్పు ఇండియా కంపెనీ ఓటమి చెందిన నేపథ్యలం లో సుపరిపాలన పేరుతో భారతదేశంలో అడుగుపెట్టి ప్రత్యక్ష పాలనకు శ్రీకారం చుట్టారు .ఎక్కడా లేనివిధంగా “ మానవ హక్కుల ప్రకటన “ తో భారతీయులను తాత్కాలికంగా సంతృప్తి పరచడానికి హప్రయత్నించారు. అయితే వీరి కుయుక్తి ని గమనించిన భారతీయులు వారి పట్ల వ్యతిరేకత రావడానికి కొంత ఆలస్యం అయినప్పటికీ ,1885 నాటికి భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో దేశాభి మాను లను కూడ గట్టడానికి తొలి ప్రయత్నాలు ప్రారంభించింది. భారత స్వాతంత్ర పోరాటం అనేది ఆరు దశాబ్దాల కాలం పాటు అనగా 1885 నుంచి 1947 వరకు జాతీయ కాంగ్రెస్ ఆధీనంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్రం సంపాదించిన సంఘటన మాత్రమే. కానీ భారతీయులలో విదేశీయులను వ్యతిరేకించే భావన వేల సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది . అలెగ్జాండర్ దండయాత్రకు వ్యతిరేకంగా పోరాడిన పోరస్ నుంచి నిన్నటి పులమావి దాడులను వ్యతిరేకించిన సామాన్య ప్రజానీకం వరకు అనేకమంది ఈ జాతీయోద్య మము లో భాగస్వాములైన వారే. శకులు, ఇండో గ్రీకులు ,కుషానులకు వ్యతిరేకంగా పోరాడిన విక్రమాదిత్యుడు ,గౌతమీపుత్ర శాతకర్ణి అరబ్బు లకు వ్యతిరేకంగా పోరాడిన రాజపుత్రులు, ఢిల్లీ సుల్తాన్ పాలకులతో పోరాడిన పృథ్వీరాజ్ చౌహాన్ ,మొగలు లకు వ్యతిరేకంగా పోరాడిన మహా రాణా ప్రతాప్, ఛ త్రపతి శివాజీ ,సిక్కు నాయకులు, యూరోపి యన్ల ను వ్యక్తిగతంగా ప్రతిఘటించిన కేరళ కుంజాలి , మరక్కర్లు, పాల యక్కారులు, సన్యాసి -పకీరు , సంతాలు లు లాంటి వారు వీరోచితంగా పోరాడి భారతీయులకు జాతీయతా భావాన్ని వారసత్వంగా అందించారు. ఈ కోవ కు చెందిన మరో తిరుగుబాటు , బ్రిటిష్ వర్తకులను,భారత భూ భాగాల నుంచి విముక్తులు చేయడానికి చేసిన ప్రయత్నం 1857 తిరుగుబాటు. ఇందులో ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియాతోపే, బేగం హజరత్ మహల్, కున్వర్ సింగ్ మొదలగువారు తూర్పు ఇండియా వర్తక సంగం నాయకులను ఎదిరించి దేశభక్తి బీజాల ను బలంగా నాటారు. ఈ ఉత్సవాలు తిరుగుబాట్లు అన్నియు కూడా కేవలం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా మాత్రమే కాకుండా స్వాభిమానం, స్వేచ్ఛ, జాతీయ చైతన్యం కొరకు జరిగాయి .ఈ విధంగా సుదీర్ఘ కాలం పాటు జరిగిన సమిష్టి వారసత్వమే భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం .అయితే పై ఉద్యమాలు అన్నియు కూడా శాశ్వతంగా భారతదేశాన్ని విదేశీయుల నుంచి విముక్తులను చేయలేక పోయాయి. కానీ భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో 1885 సంవత్సరంలో ప్రారంభమైన భారత జాతీయ పోరాటం ఇంతింతై వటుడం తైనట్టు సాదాసీదా ఆశయాలతో ప్రారంభమై చివరకు 1947 సంవత్సరం నాటికి భారతదేశాన్ని పరాయి పాలన నుంచి శాశ్వతంగా దూరం చేసింది .ఆ స్వతంత్ర భారతదేశమే నేడు జనాభాలో మొదటి స్థానం, ఆర్థిక వ్యవస్థలో మూడవ స్థానం ,క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాలు, డిజిటల్ రంగాలలో కీలకపాత్రను పోషిస్తుఅగ్ర రాజ్యాంగ దూసుకెళ్తున్నది. ఈ నేపథ్యంలో మనం భారత జాతీయ ఉద్యమాన్ని కొంతవరకైనా మనన ము చేసుకోవలసిన సమయం ఇది. ఈ జాతీయ పోరాటం ప్రపంచ దిశ నే మార్చింది. ప్రారంభంలో జాతీయ నాయకులు బ్రిటిష్ వారి పట్ల కొంత మెతక వైఖరిని ప్రదర్శించి వినతి పత్రాలు ,ప్రాధేయపడడం, చర్చల ద్వారా హక్కులు సాధించాలను కున్నారు .అది కొంతవరకు విమర్శలకు గురై నప్పటికీ ఆ కాలానికి అదే పద్ధతి సరై నదని చరిత్రకారుల వాదన .ఎందుకంటే జాతీయతా భావం కనుచూపుమేరలో కనపడని సందర్భంలో బ్రిటీష్ వారిని ప్రత్యక్షం ఎదు ర్కోవాలను కోవడంకొండ తో పోరాడినట్లు. అందువలన వారు చాకచక్యం తో వ్యవహరించి మొదటి సమావేశం 72 మంది సభ్యులతో ప్రారంభించి ,1905 వ సంవత్సరం నాటికి అనగా బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ప్రారంభమైన వందేమాతర ఉద్యమం నాటికి లక్షలాదిమంది దేశభక్తులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గళం ఇప్పడానికి పూనుకొన్నారు. అనంతరం జాతీయ ఉద్యమం యువకులైన బాల గంగాధర్ తిలక్, వబి పిన్ చంద్రపాల్ ,లాలా లజపతి రాయ్ ఆధ్వర్యంలో జరిగి బ్రిటిష్ వారి అణిచివేతకు దీటుగా ప్రత్యక్షంగా ఎదుర్కొనే స్థాయికి ప్రజలను తీర్చిదిద్దారు. “. స్వరాజ్యం నా జన్మ హక్కు “ అనే నినాదంతో తిలక్ ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని ఇ తోదికంగా పెంచాడు. 1919 లో జరిగిన జలియన్ వాలాబాగ్ మారణకాండ దేశాన్ని కుదిపేసి జాతీయవాదుల భావాలలో పూర్తి మార్పు రావడానికి కారణమైంది .ఈ సందర్భంలో మహాత్మా గాంధీ అహింస ,సత్యాగ్రహ మార్గంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం ల ద్వారా విదేశీ వస్తువుల బహిష్కరణ ,స్వదేశీ వస్తువుల తయారీ లాంటి పిలుపుతో బ్రిటిష్ పాలన ను సవాల్ విసిరాడు. గాంధీజీతో పాటు జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ,సర్దార్ వల్లభాయ్ పటేల్, రాజగోపాల చారి వంటి మహనీయులు స్వాతంత్రము తో పాటు ,సమానత్వము ,సామాజిక న్యాయము ,విద్య, స్వావలంబన, జాతీయ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలతో కూడిన దేశం కోసం తమ జీవితాలను అంకితము చేశారు. సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో జరిగిన ఆజాద్ హిందూ పౌజ్ సాయుధ పోరాటం, భగత్ సింగ్ ,రాజ గురు ,సుకదేవ్ వంటి విప్లవకారులు తమ ప్రాణాలను అర్పించిన తీరు దేశభక్తులలో ముఖ్యంగా యువతలో ఎంతో ప్రేరణ నింపాయి. “ “ ఇంక్విలాబ్ జిందాబాద్ “ నినాదం దేశమంతా మారు మ్రోగి బ్రిటిష్ వారి మూగ చెవులను తెరిచేటట్టు చేసింది. స్వాతంత్రోద్యమంలో చివరగా 1942వ సంవత్సరంలో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం బ్రిటిష్ వారిని భారతదేశం నుంచి వెళ్లగొట్టడానికి నిర్ణయించింది. ఈ సందర్భంగా గాంధీజీ ఇచ్చిన “ డూ ఆర్ డై” అనే నినాదం బ్రిటిష్ వారిని భారతదేశం నుంచి వెదలి కొట్టేంత వరకు విశ్రాంతి పొందకూడదని ప్రజలను శాసించినట్టయింది. దీనితో దాదాపు రెండు దశాబ్దాల కాలం పాటు భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ పాలకులు భారతదేశంలో వదలక తప్పలేదు. ఈ విధంగా శాంతి పద్ధతులతోనే కాకుండా వివిధ వర్గాలు ప్రజలు చేసిన తిరుగుబాటు ఫలితంగా భరతజాతిని విదేశీ దాస్య సుంకలాల నుంచి విముక్తులను చేసింది. స్వాతంత్ర సంగ్రామంలో మహిళలు చేసిన త్యాగఫలము మాత్రం తక్కువేమి కాదు. ప్రథమ స్వాతంత్ర సంగ్రామంగా వాసికెక్కిన 1857 తిరుగుబాటులో రాణి ఝాన్సీ లక్ష్మీబాయి కీలక పాత్ర పోషించి ప్రత్యర్థులైన ఆంగ్లేయులచే “ తిరుగుబాటు నాయకురాలు” గా ప్రసిద్ధి కెక్కింది. తదనంతరం స్వాతంత్ర సంగ్రామం లో సైతం చురుకైన పాత్రను పోషించి తమదైన ముద్రను ల లిఖించుకున్నారుచుకున్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర యుద్ధ రంగ ప్రవేశం తర్వాత మహిళలను స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వాములు చేయడానికి వారు చురుకుగా పాల్గొనే విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తువుల తయారీ, శాంతియుత నిరసనలు లాంటి విధానాలు వారు ఉద్యమంలో చురుకుగా పాల్గొనడానికి కారణ మైనాయి. భారత కోకిలగా ప్రసిద్ధికెక్కిన సరోజినీ దేవి, భర్తలో సగం అన్న చందాన గాంధీజీకి చేదోడువాదోడుగా నిలిచిన కస్తూరిబా గాంధీ, క్విట్ ఇండియా ఉద్యమ వీరనారి గా పేరు గడించిన అరుణా ఆసఫ్ అలీ, కాంగ్రెస్ రేడియో ను నిర్వహించి స్వాతంత్ర ఉద్యమంపై ప్రజలలో జాతీయత భావం పై అవగాహన కల్పించిన ఉషా మెహతా, జర్మనీ దేశంలో జాతీయ పతాకాన్ని ప్రదర్శించిన మేడం బికాజి కామా ,క్విట్ ఇండియా ఉద్యమంలో చెరగని ముద్ర వేసిన సుచిత కృపలాని ,ఆంధ్ర ప్రాంతానికి చెందిన దుర్గా భాయి దేశ్ముఖ్, పొనక కనకమ్మ, గిరిజన ఉద్యమంలో పాల్గొన్న మహిళ విప్లవకారులు తమ వంతు పాత్రను పోషించి ఉద్యమం ప్రత్యక్షంగా పరోక్షంగా బలపడడానికి కృషి చేశారు. స్వాతంత్రం సంపాదించడం ఒక అద్భుతం. అందులోనూ అజేయులైన ఆంగ్లేయు లను ఓడించి అహింసా యుత పద్ధతులతో పోరాడి భారతీయులు ప్రపంచ ప్రజలకు ఆదర్శ మయ్యారు. యావత్తు ప్రపంచం గాఢ నిద్రలో ఉన్నప్పుడు భారతీయులు స్వాతంత్ర సంపాదించారు అన్న నెహ్రూ మాటలు నగ్నసత్యం .అయితే స్వాతంత్రం ఒక ముగింపు కాదు, ఇది కొత్త ఆరంభం. విదేశీయుల పాలనలో ఏళ్ల తరబడి మగ్గిన భారతీయులు స్వతంత్రంగా పాలించుకు నే సత్తాను పొందిన పర్వదినం. స్వతంత్ర భారతదేశ ఎదుర్కొన్న సవాళ్లు, ముఖ్యంగా బ్రిటిష్ వారు విభజించు పాలించు విధానం పుణ్యమా అని పాకిస్తాను బాంగ్లాదేశ్ లను కోల్పోయి స్వతంత్ర భారతదేశం ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం అనేక కఠిన సవాల్ల ను సున్నితంగా పరిశీలించు కుంటూ వచ్చింది .అందులో అతి ముఖ్యమైనది, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలో స్వతంత్రంగా ఉన్న స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో కలపడం చాలా ముఖ్యమైనది. తదనంతరం ప్రపంచంలోనే ప్రత్యేకత కలిగిన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుని భారత దేశము ఎదుగుతున్న తీరు అద్భుతమనే చెప్పాలి .విదేశాంగ విధానములో అగ్రరాజ్యాల దురాక్రమణ, సామ్రాజ్యవాద విధానాల వలలో పడకుండా మూడవ కూటమి “ అలీన ఉద్యమా “ న్ని ఏర్పాటు చేసి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అగ్రరాజ్యాల బారిన పడిన ,పడుతున్న అనేక రాజ్యాలు నేడు భారతదేశం వైపు చూస్తున్నాయంటే అది పాలకుల యొక్క దూర దృష్టి అని చెప్పాలి. అయితే ప్రపంచంలో శాంతి సంస్థ ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యత్వం సంపాదించక పోవడం దురదృష్టం. చాలాకాలంగా అపరి స్కృతంగా ఉన్న కాశ్మీర్ సమస్యను కూడా మనం పరిష్కరించు కోవలసి ఉంది. పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న నిరంతర ముప్పును కూడా మనం శాశ్వతంగా పరిష్కరించు కోవాల్సింది. ఈ నేపథ్యంలో పౌరుడుగా ప్రతి భారతీయుడు ప్రజాస్వామ్య పరి రక్షకుడిగా రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ,చట్టాలను పాటించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, అసమానతలు, అవినీతి, నిరు ద్యోగము, పేదరికం లాంటి సమస్యలను పరిష్కరించడానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాల్సిన బాధ్యత ఉంది .నేటి యువత ముఖ్యంగా నేటి విద్యార్థులు రేపటి భారతదేశ నిర్మాతలు కావున విద్యను కేవలం ఉద్యోగ సాధనంగా కాకుండా, సమాజ సేవకు ఉపయోగపడే విధంగా తీసుకోవాలి. క్రమశిక్షణ ,నిజాయితీ, కష్టపడే తత్వం, శాస్త్రీయ దృక్పథం మానవత విలువలు ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలి. మానవతా విలువల స్థానంలో ప్రపంచంలో భారతదేశ స్థానం ఏమిటో ప్రతి ఒక్కరు గమనించాలి. ఎన్ఎస్ఎస్, ఎన్ సిసి ,స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి కార్యక్రమాల్లో విద్యార్థుల స్వచ్ఛందంగా పాల్గొని నిస్వార్థ సేవను అలవర్చుకోవాలి. రక్తదాన శిబిరాలు , అక్షరాస్యత శిబిరాలు, గ్రామ అభివృద్ధి లాంటి కార్యక్రమాల్లో పాల్గొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి .డిజిటల్ యుగం లో సాంకేతికతను సద్వినియోగం చేసుకొని పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్ లు, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో ప్రతిభ చూపి దేశాన్ని సాంకేతికంగా అగ్రగామిగా నిలబెట్టాలి. అదే సమయంలో భారతీయ సంస్కృతి, నైతిక విలువలను కాపాడుతూ సామాజిక బాధ్యత తో ముందుకు సాగాలి. జై హింద్..

డా. బాలగొండ గంగాధర్
(చరిత్ర అధ్యాపకులు)
కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల, కడప.

# గోదావరి పుష్కరాలు-2027ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

-ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే

-సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే

-నాణ్యతలో రాజీ పడొద్దు, ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి

-గోదావరి పుష్కరాలు -2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు

మంథని ప్రతినిధి, (ప్రజా సీమ ), ఆగస్టు 14: గోదావరి పుష్కరాలు–2027 నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు – 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శాఖల వారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కేబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్–1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజు వారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబ

ప్రజా సీమ

# హర్ ఘర్ తిరంగా ర్యాలీతో దేశభక్తి సందేశం

## -స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్ నిర్వహించిన కాకినాడ జిల్లా పోలీస్ యంత్రాంగం





**కాకినాడజిల్లా (ప్రజా సీమ )**

కాకినాడ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కాకినాడ జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా రిహార్సల్స్ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు .కాకినాడ జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్స్ జరిగాయి. అనంతరం ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని ర్యాలీలో పాల్గొన్నారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి



ప్రారంభమైన ర్యాలీ భానుగుడి సెంటర్ వరకు సాగింది. విద్యార్థులు, పోలీసులు, ప్రజలు "భారత్ మాతాకీ జై", "వందేమాతరం" అంటూ దేశభక్తి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. భానుగుడి సెంటర్ వద్ద ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా ఎస్పీ జి. బిందు మాధవ్ మాట్లాడుతూ వందేమాతరం నినాదం, జాతీయ జెండా ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించేందుకు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి భావనతో బాధ్యతాయుతమైన, ఉత్తమ పౌరులుగా జీవించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు దేశ భవిష్యత్తును నిర్ణయించే గొప్ప వ్యక్తులుగా ఎదిగి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో బలపడినప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఏఆర్ శ్రీ ఎస్. శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు, సుమారు 1,500 మంది విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం

"మొక్కలు నాటడం మాత్రమే కాదు. వాటిని సంరక్షించడం కూడా మన బాధ్యత"

రైల్వే కోడూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసులు.

**రైల్వే కోడూరు (ప్రజా సీమ )**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపి ఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు మరియు చిట్వేల్ ఎస్ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈరోజు చిట్వేల్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గా రాజు, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ క్యాడెట్లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఒక మొక్క నాటడం ద్వారా మన చుట్టూ పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించ గలమని పేర్కొన్నారు. మొక్క నాటిన తర్వాత దాని సంరక్షణకు కూడా బాధ్యత తీసుకోవాలని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో మరియు పరిసర ప్రాంతాల్లో మొక్కలను



నాటి వాటిని సంరక్షించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజంలోని ఇతరులను ప్రోత్సహించాలని సూచించారు. "ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటితే... ఊరంతా పచ్చగా మారుతుంది. మొక్కను నాటుదాం -- మొక్కను కాపాడుదాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం -- భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం." ప్రతి విద్యార్థి "నా మొక్క – నా బాధ్యత" అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని, పచ్చదనం పెంపొంది ంచడంలో చురుకైన భాగస్వాములుగా నిలవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

# జిల్లా సమీక్షా సమావేశంలో అభివృద్ధి అంశాలపై సమగ్ర సమీక్ష



**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

కాకినాడ ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ అధ్యక్షతన, జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం శుక్రవారం ప్రారంభమైంది. సమావేశానికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు, ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య, జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ తదితరులు హాజరయ్యారు. అలాగే రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు సమావేశంలో



పాల్గొన్నారు. డీఆర్‌సీ సమావేశం అజెండాలో భాగంగా గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన వివిధ సమస్యలు, అభివృద్ధి అంశాలపై అధికారులు తీసుకున్న చర్యలను వివరించారు. గత సమావేశంలో ఇచ్చిన సూచనల అమలు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్ష కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులు సూచించిన అంశాలకు అధికారులు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించే అవకాశం ఉంది.

# స్కేటింగ్ చిచ్చర పిడుగు అనంత్ దక్షిత్ కి సెల్యూట్

## - అభినందించిన డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

కేవలం మూడేళ్ల వయసులోనే 79 కిలోమీటర్ల స్కేటింగ్ ప్రయాణానికి సిద్ధమైన చిన్నారి అనంత దక్షిత్ పరుగు ప్రపంచ రికార్డు దిశగా అడుగులు వేయడంపై ఏబీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి అభినందనలు తెలిపారు. శుక్రవారం మదనపల్లె నుంచి కదిరి వరకు 79 కిలోమీటర్ల స్కేటింగ్ ప్రపంచ రికార్డు ప్రయత్నాన్ని ప్రారంభించిన చిన్నారి దక్షిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్వకర్మ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు మరియు స్వర్ణకార సంఘం జాతీయ కార్యదర్శి డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి మాట్లాడుతూ చిన్నారి దక్షిత్ తన లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తిచేసి ప్రపంచ రికార్డు దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలతో భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపచేయాలన్నారు. చిన్నారి సహస యాత్ర, క్రీడాకారులకు, క్రీడాభిమానులకు స్ఫూర్తి నింపడంతోపాటు నూతన జవసత్వాలు నింపడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడాకారులను, చిన్నారులను ప్రోత్సహించడానికి ఏబిసి సేవాసంస్థ తరఫున తమ సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడు ముందుంటామని ప్రకటించారు. చిన్నారి తలపెట్టిన సాహస యాత్ర నిర్విఘ్నంగా పూర్తిచేసి గిన్నిస్ రికార్డులో స్థానం కైవసం చేసుకోవాలని పేర్కొన్నారు.





# ఆధ్యాత్మిక వాతావరణంలో కడప పెద్ద దర్గా గంధం మహోత్సవం

## - పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్న నిసార్ అహమ్మద్

**మదనపల్లె (ప్రజా సీమ)**

అల్లాహ్ వర్షాలు కురిపించి, అందరిపై కరుణా కటాక్షాలను చూపించి, ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సంతోషం ప్రసాదించాలని కడప పెద్ద దర్గా ఉరుసు మహోత్సవంలో నిసార్ అహమ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దలు ఆరిఫుల్లా సాహెబ్ ఆహ్వానం మేరకు కడప పెద్ద దర్గాలో నిర్వహించిన హజ్రత్ అమీన్ ఉల్లా మాలిక్ గంధం ఉత్సవంలో మదనపల్లె వైకాపా సమన్వయకర్త నిసార్ అహమ్మద్ పాల్గొన్నారు. నిసార్ అహమ్మద్ తోపాటు మాజీ డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, సీనియర్ నాయకులు సుగవాసి బాలసుబ్రహ్మణ్యం గంధం ఉత్సవంలో పాల్గొన్నారు. నిసార్ అహమ్మద్ చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ అత్యంత పవిత్రమైన కడప పెద్ద దర్గా ఉత్సవంలో పాల్గొనడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ యూనస్, కరీం, సాదిక్, నాసిర్ అలీ, జబీ, యాసీన్, జైనూ, సత్తార్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.





# మిట్స్ యూనివర్సిటీలో అట్టహాసంగా తిరంగా ర్యాలీ

## - ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినీ,విద్యార్థులు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం మిట్స్ ఎన్.సి.సి,ఎన్.ఎస్.ఎస్ మరియు ఎన్.సి.సి ఎయిర్ వింగ్ విభాగాల ఆధ్వర్యంలో దేశభక్తి,జాతీయ సమైక్యతను చాటుతూ తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమం లో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు యువతలో దేశభక్తి,జాతీయ బాధ్యత,ఐక్యతా భావాలను పెంపొందించడమే తిరంగా ర్యాలీ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని,విద్యతోపాటు దేశసేవ,సామాజిక బాధ్యత,జాతీయ సమైక్యత పట్ల నిబద్ధత కలిగి ఉండాలని కార్యక్రమాన్ని ప్రారంభించారు.విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ యూనివర్సిటీ ప్రాంగణం నుంచి అంగళ్లు కూడలి వరకు తిరంగా ర్యాలీని నిర్వహించారు.దేశం ముందు దేశభక్తి మన బాధ్యత,భారత్ మాతాకీ జై,వందే మాతరం అనే నినాదాలతో నిర్వహించిన ఈ ర్యాలీలో ఎన్.సి.సి ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి,ఫీజికల్ డైరెక్టర్ డాక్టర్ దామోదరన్,అధ్యాపకులు, ఎన్.సి.సి,ఎన్.ఎస్.ఎస్ మరియు ఎన్.సి.సి ఎయిర్ వింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.






# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

## ఏపీయూడబ్ల్యూజే రక్తదాన శిబిరం పోస్టర్లు విడుదల..

**రాజంపేట (ప్రజా సీమ):**

ఏపీయూడబ్ల్యూజే 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 17వ తేదీన సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా వద్ద రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయడమే కాకుండా సేవా కార్యక్రమాలలో కూడా ముందు వరసలో ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే 70వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్నటువంటి జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు రవిచంద్ర ప్రసాద్, భాస్కర్, ఓబులేసు, కార్తీక్, శ్రీహరి, నాగేంద్ర ప్రసాద్, రాయలు, నరసింహులు, సుధాకర్, దివాకర్, రవీంద్ర, శ్రీనివాసులు, చంద్ర తదితరులు పాల్గొన్నారు



## హర్ ఘర్ తిరంగ వేడుకను ఘనంగా జరుపుకుందాం

- టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి రామకృష్ణ పిలుపు

మదనపల్లె (ప్రజా సీమ) :

20 వార్డుల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో నిర్విఘ్నంగా జరుగుతోంది.టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ,కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు.శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీ ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్,రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి,టిడిపి మదనపల్లె పట్టణ అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలుతో నిరుపేదల జీవితాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పిస్తున్నారని,ఆయన పాలనలో రాష్ట్రం సుభిక్షంగా మారిందని కొనియాడారు.నేడు (ఆగష్ట్ 15) స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై మువన్నెల జెండాను ఎగుర వేసి హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు.భారత స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగి దేశ పురోగతికి బాటలు వేద్దామన్నారు.





## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి

- పట్టణ తెలుగు యువత మాజీ అధ్యక్షులు లక్ష్మణ రాజు పిలుపు

మదనపల్లె (ప్రజా సీమ) :

ఆగష్ట్ 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంట త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుదామని ప్రజలకు మాజీ కౌన్సిలర్,పుంగనూరు పట్టణ తెలుగు యువత మాజీ అధ్యక్షులు లక్ష్మణ రాజు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల కబంధహస్తాల నుండి భరతమాతకు విముక్తి కల్పించిన స్వాతంత్ర సమరయోధులు,జాతీయ నాయకుల ఆశయాలను కొనసాగిస్తూ వారి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.దేశ సార్వభౌమత్వం,సమగ్రతను కాపాడుకోవడం ప్రతి భారతీయుని బాధ్యత అని,యువత దేశభక్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బాబుల ఆదేశాల మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తెలుగుదేశం శ్రేణులు,ప్రజలు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని ఆయన పిలుపునిచ్చారు.భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ గొప్పతనమని,సంస్కృతి,సాంప్రదాయాలను ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ఘనత మనదేనన్నారు.అన్ని మతాలవారు ఐకమత్యంగా ముందుకు సాగి మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలని కోరారు.



## గొల్లప్రోలు అభివృద్ధి పనులకు శ్రీకారం

రోడ్ పనులకు జనసేన నాయకులు శంకుస్థాపన కార్యక్రమం

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి జనసేన నాయకులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఇందులో భాగంగా శుక్రవారం గొల్లప్రోలు పట్టణంలోని 16వ వార్డు పరిధిలో కారం మిల్లు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. స్థానిక ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించేలా రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని జనసేన నాయకులు తెలిపారు.పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, గొల్లప్రోలు పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు జనసేన పార్టీ టౌన్ ఇంచార్జ్ మామిడాల సూరిబాబు, గరగ తాతాజీ, 16వ వార్డు ఇంచార్జ్ పిడక బాబురావు, 17వ వార్డు ఇంచార్జ్ మొగలిరాజా, 12వ వార్డు ఇంచార్జ్ బల్రెడ్డి నాని పాల్గొన్నారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొని రోడ్డు పనులను పర్యవేక్షించారు.రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో స్థానిక వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# పిఠాపురం పాదగయ క్షేత్రంలో అన్నా కొణిదెల ప్రత్యేక పూజలు:

## ఘన స్వాగతం పలికిన డా. తోట అనంతలక్ష్మి







పిఠాపురం (ప్రజా సీమ )

పవిత్ర శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పిఠాపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పాదగయ స్వయంభూ దత్తాత్రేయ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. ఈ పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ సతీమణి శ్రీమతి అన్నా కొణిదెల క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు స్థానిక నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఆలయ ప్రాంగణానికి చేరుకున్న శ్రీమతి అన్నా కొణిదెలకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ కాకినాడ నగర అధ్యక్షులు శ్రీ తోట సుధీర్ సతీమణి, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ తోట అనంత లక్ష్మి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.అనంతరం అన్నా కొణిదెల, డా. తోట అనంతలక్ష్మి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రావణ శుక్రవార విశిష్టతను పురస్కరించుకుని శ్రీ పురుహూతికా దేవి అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి, శ్రీ కుక్కుటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ వేద పండితులు వారికి మంత్రోచ్చారణల నడుమ ఆశీర్వచనాలు అందించి, తీర్థప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు మాట్లాడుతూ.. పాదగయ క్షేత్రాన్ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పవిత్రమైన ఈ శ్రావణ శుక్రవారం రోజున అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉన్నతాధికారులు, అర్చక స్వాములు, జనసేన పార్టీ ముఖ్య నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధితో నిరుపేదల వైద్యానికి భరోసా

- ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

మదనపల్లె (ప్రజా సీమ) :

నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులు అనారోగ్యంతో వివిధ ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలు ఎమ్మెల్యే షాజహాన్ భాష వద్ద తమ బిల్లులు అందజేసిన అర్హులైన వారికి నేడు ఎమ్మెల్యే షాజహాన్ బాషా తమ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా లబ్ధిదారులకు 18 మందికి 19.27 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో అనారోగ్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించడం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.తమ నియోజకవర్గంతో పాటు తంబళ్లపల్లె,పుంగనూరు నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అర్హులైన పేదలు తన వద్దకు వచ్చి బిల్లు ఇవ్వడం వారికి సకాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించడం తనకెంతో సంతోషంగా ఉందనన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## భాజపా రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులుగా యల్లంపల్లె ప్రశాంత్

- శుభాకాంక్షలు తెలిపిన పార్టీ నాయకులు,కార్యకర్తలు

మదనపల్లె (ప్రజా సీమ) :



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణానికి చెందిన యల్లంపల్లి ప్రశాంత్ నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో యల్లంపల్లి ప్రశాంత్ అంచ లంచెలుగా ఎదుగుతున్నారన్నారు.గతంలో రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా ఆయన సమర్థవంతం గా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. పార్టీ అధిష్టానం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విజయవంతం చేయడంలో ఆయన దిట్ట అన్నారు.ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి అధిష్టానం రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులుగా నియమించడం హర్షణీయమని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.అనంతరం యల్లంపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.ఈ పదవి తన బాధ్యతను మరింత పెంచిందని,ఏపీలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.తనకు ఈ పదవి రావడానికి సహకరించిన పార్టీ నాయకులు,స్నేహితులు,శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.

# ఎర్ర కోటపై ఎగిరిన తొలి జెండా తయారు చేసింది వెంకటాచలం - మునిరత్నమ్మాళ్ దంపతులు

### -ఆ జాతీయ పతాకం తయారైంది తమిళనాడులోని గుడియాత్తంలోనే

(ప్రజా సీమ )

జాతీయ జెండాను రూపొందించింది పింగళి వెంకయ్య అని భారతీయులందరికీ తెలుసు. కాని 1947 ఆగస్టు15న స్వతంత్రం వచ్చిన తర్వాత ఎర్రకోటపై ఎగిరిన తొలి జాతీయ పతాకం సిద్ధం చేసింది మాత్రం దక్షిణ భారతంలోని తమిళనాడులోని చేదంపతులు దీనిని తయారు చేశాంసంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. ఇతని చేనేత మెళకువల గురించి తెలుసుకున్న అధికారులు... పింగళి వెంకయ్య రూపొందించిన మేరకు జాతీయ పతాకాన్ని తయారు చేయాలని కోరారు. 12 అడుగుల వెడల్పు, 18 అడుగుల పొడవుతో మూడు జాతీయ పతాకాలను భార్య మునిరత్నమ్మాళ్‌తో కలసి వెంకటాచలం తయారుచేశారు. వీటిలో ఒకటి 1947 ఆగస్టు 15వ తేది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఎర్ర కోటపై ఎగురవేశారు.ప్రస్తుతం ఆ పతాకం జార్జి కోట ప్రాంగణంలోని పురావస్తు పరిశోధనశాఖ మ్యూజియంలో అద్దాల పెట్టెలో భద్రంగా వుంది. ఆ రోజున దేశవ్యాప్తంగా 10 లక్షల జెండాల తయారీ కోసం గుడియాత్తం నగరానికి ఆర్డర్లు వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. వెంకటాచలంను మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ అభినందించారు. నాటి ప్రధాని నెహ్రూ వ్యక్తిగత కార్యదర్శి వెంకటాచలంకు కృతజ్ఞతలు తెలుపుతూ రాసిన లేఖ ఇప్పటికీ వెంకటాచలం కుటుంబీకుల వద్ద ఇంకా వుంది.



# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై 18న ఆందోళన

## - కడప కలెక్టరేట్ వద్ద నిరసనకు ఏఐటీయూసీ పిలుపు

వేంపల్లె ప్రజాసీమ:

ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీం కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బళ్లారపు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు దస్తగిరి, కార్యదర్శి సి.బాలాజీ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళనకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లైయిమ్‌లను వెంటనే చెల్లించాలని, ప్రమాదంలో గాయపడిన వారికి రూ.లక్ష, సాధారణ మరణానికి రూ.2 లక్షలు, వివాహానికి రూ.70 వేలు, ప్రసవానికి రూ.50 వేలు చెల్లించాలని కోరారు. పాత పద్ధతిలోనే కార్డులు జారీ చేసి రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం కింద రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. స్కూల్ ఆయాలు, పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పరిశ్రమల్లో పీఎఫ్,



ఈఎస్ఐతో పాటు కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే మరిన్ని పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వల్లెపు బుజ్జి, చలపతి, బాబా ఫక్రుద్దీన్, గోపాల్, గంగయ్య, నాగరాజు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలక్ష్మిగా దర్శనమిచ్చిన వాసవిమాత

## - శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక పట్టణంలోని 122 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో వాసవి మాతకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ తెలిపారు. వాసవి మాతను ఆదిలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి వాసవి మాతను పీఠంపై కొలువుదీర్చి భుజాలపై మోస్తూ మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామావళి, వాసవి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్‌రావు, ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు దొంతు సుబ్బారావు, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మతో పాటు ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు



# విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

## - విశ్వం సీబీఎస్ఈలో అట్టహాసంగా పదవీ స్వీకారోత్సవం






మదనపల్లె (ప్రజా సీమ) :

నాయకత్వం అనేది ఒక బిరుదు లేదా హోదాకు సంబంధించినది కాదు.అది ప్రభావం,స్ఫూర్తి మరియు ప్రేరణకు సంబంధించింది. ఈ స్ఫూర్తితో,విశ్వం స్కూల్ సీబీఎస్ఈ తన పదవీ స్వీకారోత్సవం 2026-27ను శుక్రవారం అత్యంత వైభవంగా మరియు దేశభక్తి ఉప్పెనతో సగర్వంగా నిర్వహించింది. అజ్ఞాన పారవశ్యానికి మరియు బాధ్యతాయుతమైన ప్రయాణానికి నాంది పలుకుతూ మన ముఖ్య అతిథి రూరల్ సీఐ ఎం.రవి నాయక్,ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్ జీవన్ కుమార్,అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఎ.కాశయ్యలచే జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఇందులో భాగంగా మార్చ్ పాస్ట్ మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మన నూతనంగా ఎన్నికైన పాఠశాల విద్యార్థి నాయకులు, సహాయక విద్యార్థి నాయకులు,హౌస్ కెప్టెన్లు,వైస్ కెప్టెన్లు మరియు మంత్రులు పాఠశాల విలువలు,క్రమశిక్షణ మరియు గౌరవాన్ని నిలబెడతామని ప్రతిజ్ఞ చేశారు.గర్వంగా తల ఎత్తుకొని,వారు తమ బ్యాడ్జ్‌లు మరియు శాష్‌లను అందుకున్నారు.ఇది విద్యార్థి మండలిలో వారి అధికారిక ప్రవేశానికి గుర్తుగా నిలిచింది.హక్కులు మరియు బాధ్యతల ప్రకటన నాయకత్వం జవాబుదారీతనంతో కూడి ఉంటుందని మండలి సభ్యులకు గుర్తుచేసింది.వారు ప్రవర్తనలో ఆదర్శంగా ఉంటామని,తమ తోటివారి మాట వింటామని మరియు పాఠశాల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేస్తామని వాగ్దానం చేశారు.ముఖ్య అతిథి మరియు ప్రిన్సిపాల్‌లి చేసిన స్ఫూర్తిదాయక ప్రసంగాలు,యువ నాయకులను నిజాయితీ,జట్టు స్ఫూర్తి మరియు దార్శనికతతో నాయకత్వం వహించమని ప్రోత్సహించాయి.మండలి మంత్రులు తమ కృతజ్ఞతను తెలియజేస్తూ ప్రగతిశీల మరియు ఐక్య విద్యా సంవత్సరం కోసం తమ దార్శనికతను పంచుకున్నారు.ధన్యవాదాలు మరియు దాని తర్వాత జాతీయ గీతం ఆలపించడంతో ఈ కార్యక్రమం ముగిసింది.ప్రిన్సిపాల్ డాక్టర్ రోసెలిన్ ప్రియ మాట్లాడుతూ ఈ పదవీ స్వీకార కార్యక్రమం కేవలం బ్యాడ్జీల బదిలీ మాత్రమే కాదు,ఇది విశ్వాసం మరియు ఆశల బదిలీ.2026-27 విద్యార్థి మండలి విశ్వం వారసత్వాన్ని గర్వంగా ముందుకు తీసుకువెళ్లి,పాఠశాలను మరింత ఉన్నత శిఖరాలకు నడిపిస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉందన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా నియమితులైన నాయకులందరికీ అభినందనలు.మీరు నాయకత్వం వహించి స్ఫూర్తినిచ్చి,ఒక మార్పును తీసుకురావాలని ఆశిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన స్కూల్ సోషల్ డిపార్ట్మెంట్ ఉపాధ్యాయులను మరియు పి.ఈ.టి.లను ప్రత్యేకంగా అభినందించారు.

# గండి క్షేత్రం శ్రీశనీశ్వరస్వామి నూతన కార్యాలయం ప్రారంభం

## - దాతలు ముందుకు రావాలని ట్రస్ట్ పిలుపు

వేంపల్లె ప్రజాసీమ:

జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలోని శ్రీజ్యేష్టాదేవి సమేత శ్రీశనీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. శుక్రవారం వేంపల్లె పట్టణం, పులివెందుల రోడ్డులోని న్యూ కందుల కాంప్లెక్స్ లో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం శుభముహూర్తంలో జరిగింది. కెఎస్ఆర్ఎం విద్యాసంస్థల ఛైర్మన్ డా. కందుల చంద్ర ఓబులరెడ్డి (నాని) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది.ఈ సందర్భంగా శ్రీశనీశ్వర స్వామి ప్రసన్న పీఠం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ గండి క్షేత్రంలోని ఆలయాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. భక్తులు, దాతలు మంజూరు చేసే నిధులతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ నూతన కార్యాలయం ద్వారా భక్తులకు సేవలందించడం మరింత సులభతరం అవుతుందని ట్రస్ట్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు



# అంబరాన్నంటిన రామిరెడ్డి ద్వాజారెడ్డి జన్మదిన వేడుకలు






## పూల వర్షంతో ఘనంగా సత్కరించిన అభిమానులు, పార్టీ శ్రేణులు

## వేడుకలను జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన ద్వాజారెడ్డి

రైల్వే కోడూరు ( ప్రజాసీమ )

తిరుపతి జిల్లా రైల్వే కోడూరు ఎస్ ఎల్ ఆర్ ని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి ద్వాజారెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ వేడుకలను కంభం శ్రీనివాసులురెడ్డి, మల్లు కృష్ణారెడ్డి,కొన్నిపాటి ప్రసాద్, గిరి వర్మ,గౌతమ్ రెడ్డి, బైరెడ్డి అనిల్ రెడ్డి ల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఉపసర్పంచ్ తోట శివ సాయిలతో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు హాజరయ్యారు.

### కోలాహలంగా ప్రారంభమైన వేడుకలు

కార్యక్రమానికి విచ్చేసిన రామిరెడ్డి ద్వాజారెడ్డికి అభిమానులు, కార్యకర్తలు బాణసంచా కాల్పులు, డ్రమ్స్ వాయిద్యాల నడుమ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన భారీ కేకును ద్వాజారెడ్డి కట్ చేసి, మొదటగా ముఖ్య అతిథి ముద్దా బాబుల్ రెడ్డికి తినిపించారు. ఆ తర్వాత విచ్చేసిన అభిమానులకు, నాయకులకు కేకును పంచిపెట్టారు. శుభాకాంక్షలు తెలిపేందుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం విచ్చేసిన వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణంలో విందు ఏర్పాటు చేశారు.ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నాను - రామిరెడ్డి ద్వాజారెడ్డిఈ సందర్భంగా రామిరెడ్డి ద్వాజారెడ్డి మాట్లాడుతూ... “నా పుట్టినరోజు సందర్భంగా ఇంత భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రత్యక్షంగా, ఫోన్ ద్వారా మరియు సోషల్ మీడియా వేదికగా నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. నాపై మీరు చూపిన ప్రేమాభిమానాలు, ఆప్యాయతలు ఎప్పటికీ మరువలేనివి. నాపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లప్పుడూ కాపాడుకుంటాను. ఎవరికి ఏ కష్టం వచ్చినా ద్వాజారెడ్డి అనే నేను ఎప్పుడూ ముందుంటాను,” అని స్పష్టం చేశారు. అలాగే, పార్టీలకతీతంగా తనకు శుభాకాంక్షలు తెలిపి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన నాయకులకు, అభిమానులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# భవిత కేంద్రంలో స్క్రైబ్‌లకు ఘన సన్మానం

## - దివ్యాంగ విద్యార్థులకు పరీక్షల్లో సహకరించిన విద్యార్థులకు బహుమతులు

వేంపల్లె ప్రజాసీమ:

స్థానిక భవిత దివ్యాంగుల విద్యా వనరుల కేంద్రంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు స్క్రైబ్‌లుగా సహకరించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. పదో తరగతిలో నలుగురు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎనిమిది మంది, రెండో సంవత్సరంలో ఒక విద్యార్థి ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల సమయంలో వీరికి సహకరించిన స్క్రైబ్‌ల సేవలను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సమగ్ర శిక్షా అభియాన్ సమన్వయకర్త వెంకటసుబ్బయ్య, ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్, జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయుడు ఖయ్యూమ్, జూనియర్ కళాశాల అధ్యాపకురాలు షాహిదా భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల విద్యాభివృద్ధికి భవిత కేంద్రం సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ఎంఈఓ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ పద్మావతమ్మ, సాగర్ రాజు భవితా కేంద్రానికి ఓపెన్ ర్యాక్, ఫ్యాన్‌ను అందించడం అభినందనీయమన్నారు. అలాగే ఎంఈఓ స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. షాహిదా బాను మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులకు డిగ్రీ ప్రవేశాలకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈడీఎస్ఎస్ స్వర్ణలత, ఐఈఆర్‌టీలు యశోద, సుజాత, సీజీవీ సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

# శ్రావణమాస ప్రత్యేక పూజలు

## - 29న స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం

### - ఆలయ ఇఓ కడప సుభాష్

**వేంపల్లె ప్రజాసీమ:**

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రీలక్ష్మి వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఓ కడప సుభాష్ వెల్లడించారు. స్థానిక పట్టణంలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఉన్న స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆగమ సాంప్రదాయ ప్రకారం శ్రీ వృషభాచలేశ్వర స్వామి ఆలయంలో ఉంచి నిత్య పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి శనివారం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు. దాతల వివరాలు బోర్డుపై నమోదు చేసి, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, సత్కరించే కార్యక్రమాన్ని చేపడుతామని వెల్లడించారు. శ్రావణమాస మూడో శనివారం ఆగష్టు 29న స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవాన్ని కడు రమణీయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ పివి రమణ, సభ్యులు రామయ్య, జ్యోతి, వెంకట సుబ్బమ్మ, వరలక్ష్మి, అర్చకులు హరిప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయండి

## - రోడ్డు భవనాల శాఖ మంత్రికి వినతిపత్రం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక పులివెందుల రోడ్డులోని గురుమూర్తితోట, టైల్స్ మౌలా వీధుల్లో కొత్త సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి విన్నవించారు. శుక్రవారం మానవత సంస్థ సభ్యుడు, ఫిజీయోథెరపి వైద్యుడు డా.యోగీశ్వర్ బాబు, ఆ ప్రాంత వాసి నేతి శంకర్ తో పాటు ప్రజలు, మంత్రిని కలిసి ఆయా సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గత 17 ఏళ్ల క్రితం ఏర్పాటైన సిసి రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, తాగునీటి పైప్ లైన్ కోసం తవ్విన రోడ్డు మరింత అధ్వానంగా మారిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ నివాస ప్రాంతం నుంచి ప్రధాన రోడ్లపై చేరేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. వర్షకాలంలో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి నెలకొని ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేనందున ఇళ్ల ప్రాంతాల్లోనే నీరు నిలిచే స్థితిలో ఉందన్నారు. మంత్రి చొరవ చూపి తమ ప్రాంతాల్లోని సమస్యలపై పరిష్కారానికి కృషి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు శివారెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఎల్లారెడ్డి, బయపురెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



# ఎస్ఐఆర్ పెండింగ్ ఓటర్లకు హియరింగ్ పత్రాలుపరిశీలించినఅధికారులు

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

ఎస్ఐఆర్‌లో భాగంగా వివిధ కారణాలతో నోటీసులు అందుకున్న ఓటర్లకు పుల్లంపేట మండలం సీతారాంపేట గ్రామంలో హియరింగ్ నిర్వహించారు. గత నెలలో చేపట్టిన సర్వేలో తాత్కాలికంగా పెండింగ్‌లో ఉంచిన ఓటర్ల నుంచి ఆధార్, నివాసం, జనన తేదీ తదితర ధ్రువపత్రాలను స్వీకరించి అధికారులు పరిశీలించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలను తదుపరి ప్రక్రియకు పంపనున్నట్లు తెలిపారు. ఏఈఆర్ఓ ఏవో ప్రవీణ్‌కుమార్, పరిశీలకులు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఓ సుమన్‌తో పాటు సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

## - రాష్ట్ర అదనపు సంచాలకులు విజయలక్ష్మి

**వేంపల్లె ప్రజాసీమ:**

తీవ్ర వర్షాభావ పరిస్థితులను (ఎల్ నినో) ఎదుర్కొనేందుకు రైతులు ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్దతులు అవలంబించాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మండలంలోని నాగూరు గ్రామ రైతులతో ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై ఆరాతీసారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఏర్పడుతున్న అనిశ్చిత వర్షపాతం, ధీర్ఘకాలిక వర్షభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల సాగులో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు వేసే ముందు వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు సుబ్రమణ్యేశ్వర రావు, సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్ రెడ్డి, వేంపల్లె మండల వ్యవసాయ అధికారి బాల గంగాధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ కాకినాడలో ఘనంగా తిరంగా ర్యాలీ

## ర్యాలీ లో పాల్గున్న కాకినాడ ఎంపీఉదయ్ శ్రీనివాస్, పంతం నానాజీ

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతి సమైక్యత, దేశభక్తి స్ఫూర్తిని చాటేందుకు కాకినాడలో నిర్వహించిన తిరంగా బైక్ ర్యాలీలో గౌరవ కాకినాడ ఎంపీ శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ గారు పాల్గొన్నారు.కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి మసీద్ సెంటర్, జగన్నాథపురం, సినిమా రోడ్ మీదుగా భానుగుడి వరకు ర్యాలీ కొనసాగింది. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ గారు జాతీయ జెండాతో ర్యాలీలో పాల్గొని దేశభక్తి సందేశాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే శ్రీ పంతం నానాజీ గారు, డీసీసీబీ ఛైర్మన్ శ్రీ తుమ్మల బాబు గారు, కౌడా ఛైర్మన్ శ్రీ తలాటం సత్య గారితో పాటు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు ఆసుపత్రికి తరలింపు

**పుల్లంపేట ప్రజాసీమ న్యూస్:**

పుల్లంపేట బైపాస్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. కూలి పనులు ముగించుకుని రాజంపేటకు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న బోయినపల్లి సుధాకర్ను ట్రాక్టర్ డ్రైవర్ రివర్స్ తీసుకునే సమయంలో గమనించకపోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అనంతరం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సుధాకర్‌ను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రమాద ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





# గండి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

## - మంత్రికి వినతిపత్రం

**వేంపల్లె ప్రజాసీమ:**


స్థానిక నాల్గు రోడ్ల కూడలి నుంచి గండి బైపాస్ రోడ్డు వరకు గల గండిరోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డికి బిజెపి రాష్ట్ర మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి పి.సుష్మా కోరారు. శుక్రవారం స్థానిక నాల్గు రోడ్ల కూడలి ప్రాంతంలో మంత్రిని కలిసి సంబంధిత వాటిపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఆ ప్రాంత రోడ్డు విస్తరణ పనుల్లో రోడ్డు, డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందన్నారు. కొత్త రహదారి మంజూరై, పనులు రద్దు అయినట్లు వివరించారు. దీంతో గండిరోడ్డు మీదుగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ రోడ్డు గుండా పవిత్ర పుణ్యక్షేత్రం గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం, ప్రతిష్టాత్మకమైన ట్రిపుల్ ఐటీ విద్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఆ ప్రాంతంలో కొత్త సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంజూరు చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి తక్షణమే స్పందించి సంబంధిత అధికారులకు నివేదికతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి వాణిజ్య విభాగం అధ్యక్షుడు దొంతు సుమన్, నాయకులు ఈశ్వర్ రెడ్డి, మాధవి, సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.



# విజయభారతి అధినేతకు బిజెపిలో అత్యంత కీలక బాధ్యతలు

## - రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్.సేతు నియామకం

**మదనపల్లె (ప్రజా సీమ) :**



భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పార్టీకి సంబంధించి కీలక సంస్థాగత నియామకాలను శుక్రవారం ప్రకటించారు.ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి.అన్నమయ్య జిల్లా నుంచి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా ముగ్గురు ఎంపికయ్యారు.ఇందులో విజయభారతి విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్.సేతుకి చోటు లభించింది.ఈ సందర్భంగా ఆయనకి అభినందనలు వెల్లువెత్తాయి.ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ విజయభారతి విద్యాసంస్థల ద్వారా ఎంతో మందికి విలువలతో కూడిన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు ఎన్.సేతు బాటలు వేశారని,అదేవిధంగా భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ప్రత్యేక ముద్రవేశారన్నారు.ఆయన సేవలను గుర్తించి బిజెపి అధిష్టానం రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులుగా బాధ్యతలు అప్పగించడం శుభపరిణామమన్నారు.భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.బీజేపి రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులుగా ఎంపికైన ఎన్.సేతుకి విజయభారతి ప్రిన్సిపల్ నిశ్చిత సేతు,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు,బిజెపి నాయకులు,కార్యకర్తలతోపాటు విద్య ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# శ్రీరామ్ చినబాబు చేత అనంత్ దక్షిత్ స్కేటింగ్ యాత్ర ప్రారంభం

## - సంఘీభావం తెలిపిన జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

**మదనపల్లె (ప్రజా సీమ):**

కేవలం మూడేళ్ల చిన్నారి అనంత దక్షిత్ 79 కిలోమీటర్ల స్కేటింగ్‌తో ప్రపంచ రికార్డు సాధించే లక్ష్యంతో చేపట్టిన యాత్ర శుక్రవారం మదనపల్లెలో ఘనంగా ప్రారంభమైంది.మదనపల్లె నుంచి కదిరి వరకు 79 కి.మీ స్కేటింగ్ ప్రయాణాన్ని ఉదయం 6:30 గంటలకు అన్నమయ్య సర్కిల్,రింగ్‌రోడ్ నుండి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు,అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ కె.వెంకటాద్రి పచ్చజెండా ఊపి చిన్నారి దక్షిత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్మీ అధికారులు,దేశభక్తులు,బిజెపి యువ నాయకులు సింహం శ్రీకాంత్,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దక్షిత్‌కు ప్రోత్సాహం అందించారు.చిన్న వయసులోనే ప్రపంచ రికార్డు లక్ష్యంతో 79 కి.మీ స్కేటింగ్ చేపట్టిన దక్షిత్‌ను పలువురు అభినందించారు.అతని ప్రయత్నం విజయవంతం కావాలని,ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# టాక్సిక్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు



సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అద్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్

టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# ఓ కుటుంబ కథా చిత్రమ్...విశ్వనాథ్ అండ్ సన్స్




కొన్నేళ్లుగా కుటుంబ కథలు అరుదుగా తెరకెక్కుతున్నాయి. అగ్ర కథానాయకులైతే అటువైపు దృష్టిపెట్టడమే మానేశారు. ఈమధ్యే మళ్లీ ఆ కథలకు పూర్వ వైభవం వస్తున్నట్టు అనిపిస్తోంది. పలువురు యువ దర్శకులు కుటుంబ కథలపై మళ్లీ దృష్టిపెడుతున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి తమిళ కథానాయకుడు సూర్యతో 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమా ద్వారా అదే ప్రయత్నం చేశారు. సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న కుటుంబానికి చెందిన వారసుడు. పేరున్న వ్యాపారవేత్త అయినా, 40 ఏళ్లు వచ్చినా వివాహం చేసుకోడు. తల్లి (రాధిక శరత్‌కుమార్) మాత్రం పెళ్లి చేసుకోవాలని, వారసుడిని కని ఇవ్వాలని పోరు పెడుతుంటుంది. దాంతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాబుని కని ఇంటికి తీసుకొస్తాడు. కానీ ఊహించని రీతిలో ఆ చిన్నారి అనారోగ్యానికి గురవుతాడు. చికిత్స చేసే క్రమంలో ఆ చిన్నారికి కన్నతల్లి అవసరం ఏర్పడుతుంది. దాంతో ఆమెని వెతుక్కుంటూ మళ్లీ అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. మరి తన బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? ఇంతకీ ఆమె ఎవరు? అమెరికా నుంచి ఇండియాకి రావడానికి అంగీకరిస్తుందా? లేదా? సంజయ్ పెళ్లి విషయంలో తన తల్లి కోరికని నెరవేర్చాడా?


సంజయ్ జీవితంలో మదన కామేశ్వరి అలియాస్ మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? తదితర విషయాలన్నీ హృద్యంగా చిత్రీకరించారు. ఇంటిల్లిపాదీ కలిసి ఆస్వాదించే స్వచ్ఛమైన వినోదం, భావోద్వేగాలున్న సినిమా ఇది. హృదయాల్ని హత్తుకునే ఓ కుటుంబ కథని తెరపైకి తీసుకొచ్చారు వెంకీ అట్లూరి. తన శైలి క్లాస్, పరిణతితో కూడిన రచనతో సూర్యలోని క్లాస్ నటుడిని ఆవిష్కరించిన తీరు ఈ సినిమాకి హైలైట్. హీరో హీరోయిన్ల మధ్య వయసు తేడా, సరోగసీ ద్వారా కన్న బిడ్డతో ముడిపడిన భావోద్వేగాలు ఈ కథకు కొత్తదనం తీసుకొచ్చాయి. సంజయ్ – మ్యాడీ కలిసినప్పటి నుంచి సినిమాలో సందడే సందడి. ముఖ్యంగా సంజయ్ తల్లితో కలిసి మ్యాడీ చేసే అల్లరి చాలా బాగుంటుంది. కొన్ని సున్నితమైన సన్నివేశాల్ని దర్శకుడు డీల్ చేసిన తీరు చాలా బాగుంటుంది. సూర్య, మ్యాడీ బంధం ఏ తీరానికి చేరుతుందన్న ఆసక్తిని రేకెత్తిస్తూ ద్వితీయార్ధం మొదలవుతుంది. అయితే, కోర్ట్ సన్నివేశాలు, ఆ తర్వాత చోటు చేసుకునే నాటకీయ పరిణామాలతో వచ్చే సీన్లు పెద్దగా ఆకట్టుకోకపోగా కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టు అనిపిస్తుంది. అంతలోనే రాధిక పాత్ర నేపథ్యంలో వచ్చే మలుపుతో కథ అనూహ్యంగా మరో దారిని తీసుకుంటుంది. దాంతో సినిమా కాస్త పక్కదారి పట్టినట్లు అనిపిస్తుంది. అంజలీదేవి (రవీనా టాండన్), ఆమె కూతురు, తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాల్లో కొన్ని భావోద్వేగాలు, నాజర్ పాత్రతో కొంత హాస్యం పండటం సినిమాకి కలిసొస్తుంది. ఈ కథకు ముగింపు కూడా క్లాస్‌గానే ఉంటుంది. ఇలాంటి కథలకు ఇదే సరైన ముగింపు అనిపిస్తుంది కానీ, మరింత హంగామా కోరుకునేవాళ్లకు అది సంతృప్తిని ఇవ్వకపోవచ్చు. సూర్యలోని క్లాస్ నటుడిని పూర్తిగా వాడుకున్న సినిమా ఇది. ఆయన పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. మ్యాడీగా మమిత బైజు నటన ఈ సినిమాకి ప్రధాన ఆకర్షణ. జీవీ ప్రకాశ్‌కుమార్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి బలం. విజువల్స్ ఆకట్టుకుంటాయి. దర్శకుడు వెంకీ రచన, మాటలు చాలా బాగున్నాయి.

# అతీంద్రియ శక్తుల హర్రర్ స్టోరీ అగధ

ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని

అందుకుంది చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.








# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక

టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma